అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
శుక్రవారం 28, మార్చి 2025 | సంపుటి :02 | సంచిక :43 | పేజీలు :06

## 513 కేజీల గంజాయి దహనం



- దీని విలువ రూ. కోటికిపైనే..
- మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు
- మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

02

## ఏసీబీకి చిక్కిన డీఈఎంవో..

- మెడికల్ షాప్ నిర్వాహకుడిని లంచం డిమాండ్
- రూ. 30 వేలు తీసుకుంటూ పట్టుబడిన రవిశంకర్

03




అర్హత లేదు. వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేదు. అయినా వైద్యుడిగా చెలామణి అవుతున్నారు కొందరు కేటుగాళ్లు. పాథాలజిస్టులు లేకుండా, తెలియకుండానే వారి పేరిట డయాగ్నస్టిక్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మందుల దుకాణంలో ఉద్యోగిగా పని చేసిన వారు, పేరొందిన వైద్యుడు వద్ద కొంతకాలం సహాయకుడిగా ఉన్నవారు, అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేసి మానేసిన వారు.. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇలాంటి చాలామంది డాక్టర్ అవతారం ఎత్తుతున్నారు. ఇష్టారీతిన చికిత్సలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నకిలీ వైద్యుడు అని గుర్తించే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఉమ్మ డి వరంగల్ జిల్లాలో మొత్తం సుమారు 1500 వరకు దవాఖానలు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉండగా, ఇందులో సగానికిపైగా ఎలాంటి అనుమతి లేనివే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరంగల్, హన్మకొండ, కాజీపేటల్లో 75 శాతానికి పైగా అర్హతలేని వారే నిర్వహిస్తున్నట్లు సమాచారం. సంబంధిత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ నకిలీ వైద్యుల ఆగడాలు పెరిగిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

–అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

# నకిలీ వైద్యుల దందా!



### ఉమ్మడి జిల్లాలో సుమారు 5 వేల మంది ఫేక్ డాక్టర్లు !




- దవాఖానలు, క్లినిక్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లలో ఇష్టారాజ్యం
- ఎలాంటి అనుమతి లేకుండానే చికిత్స
- ట్రైసిటీలో 75 శాతం హాస్పిటళ్లకు నో పర్మిషన్
- పెరిగిపోతున్న ఫేక్ డాక్టర్ల ఆగడాలు
- ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని అధికారులు
- పలు క్లినిక్‌లపై మెడికల్ కౌన్సిల్ అధికారుల దాడులు.. కేసులు

02

## బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు



- ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి
- తాగునీటి సమస్యపై దృష్టిసారించాలి
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు త్వరగా పూర్తికావాలి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హైదరాబాద్‌లో ఉమ్మ డి జిల్లా అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష
- హాజరైన జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

03

## దారుణం

ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారుల అనుమానాస్పద మృతి

- దవాఖానలో చికిత్స పొందుతున్న తల్లి
- సంగారెడ్డి జిల్లాలో ఘటన

04




## కూతురిని ప్రేమిస్తున్నాడని యువకుడి హత్య

- పుట్టిన రోజునాడే కిరాతకం..
- గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి
- పోలీసుల అదుపులో నిందితుడు సదయ్య
- పెద్దపల్లి జిల్లాలో కలకలం



04



## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

- ఉరి వేసుకొని బలవన్మరణం
- వరంగల్ జిల్లా దీక్షకుంటలో ఘటన

04

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక





# నకిలీ వైద్యుల దందా..!

- ఉమ్మడి జిల్లాలో సుమారు 5 వేల మంది ఫేక్ డాక్టర్లు !
- దవాఖానలు, క్లినిక్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లలో ఇష్టారాజ్యం
- ఎలాంటి అనుమతి లేకుండానే వైద్యులుగా చెలామణి
- ట్రైసిటీలో 75శాతం హాస్పిటళ్లకు నో పర్మిషన్
- పెరిగిపోతున్న ఫేక్ డాక్టర్ల ఆగడాలు
- ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని అధికారులు
- పలు క్లినిక్‌లపై మెడికల్ కౌన్సిల్ అధికారుల దాడులు.. కేసులు

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: అర్హత లేదు. వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేదు. అయినా వైద్యుడిగా చెలామణి అవుతున్నారు కొందరు కేటుగాళ్లు. పాథాలజిస్టులు లేకుండా, తెలియకుండానే వారి పేరిట డయాగ్నస్టిక్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మందుల దుకాణంలో ఉద్యోగిగా పని చేసిన వారు, పేరొందిన వైద్యుడు వద్ద కొంతకాలం సహాయకుడిగా ఉన్నవారు, అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేసి మానేసిన వారు.. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇలాంటి చాలామంది డాక్టర్ అవతారం ఎత్తుతున్నారు. ఇష్టారీతిన చికిత్సలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నకిలీ వైద్యుడు అని గుర్తించే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం సుమారు 1500 వరకు దవాఖానలు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉండగా, ఇందులో సగానికిపైగా ఎలాంటి అనుమతి లేనివే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరంగల్, హన్మకొండ, కాజీపేటల్లో 75 శాతానికిపైగా అర్హతలేని వారే నిర్వహిస్తున్నట్లు సమాచారం. సంబంధిత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ నకిలీ వైద్యుల ఆగడాలు పెరిగిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఇష్టారాజ్యం..

అల్లోపతి ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ... ఎంబీబీఎస్ అర్హతలు ఉన్నవారు ఏర్పాటు చేసే ప్రైవేట్ ఆసుపత్రి, క్లినిక్, డయాగ్నస్టిక్ సెంటర్లన్నింటికీ అనుమతి తప్పనిసరి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో దరఖాస్తు చేసుకొని ఉండాలి. ఆయా కేంద్రాల్లో పనిచేసే వైద్యులకు రిజిస్ట్రేషన్ ఉండాలి. అగ్నిమాపక, బయోవేస్ట్ మేనేజ్మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ తో సహా అన్ని రకాల పత్రాలు ఉన్నప్పుడే ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇస్తారు. కానీ ఇవేం లేకుండానే యథేచ్ఛగా కొందరు దవాఖానలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లలో పడకలు నిర్వహించడం, రోగులకు సెలైన్లు పెట్టడం, యాంటీ బయోటిక్ మందులు ఇవ్వడం, స్టీరాయిడ్ ఇంజిక్షన్స్ ఇవ్వడం, ఆయుర్వేదిక్ వైద్యులు గర్భిణులకు అలోపతి మందులు ఇవ్వడం, హైడోస్ యాంటీ బయోటిక్ మందులు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. తెలంగాణ వైద్య మండలి టాస్క్‌ఫోర్స్ దాడులతో ఈ నకిలీల బాగోతం బయటపడుతోంది. ఇటీవల నగరంతోపాటు చుట్టుపక్కల పదుల సంఖ్యలో ఫేక్ డాక్టర్లపై కేసులు నమోదవడం గమనార్హం.

## 91543 82727 లో ఫిర్యాదు చేయొచ్చు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,500 మంది క్వాలిఫైడ్ వైద్యులుంటే, సుమారు 5 వేల మంది నకిలీ వైద్యులున్నట్లు సమాచారం. హన్మకొండ జిల్లాలో అనుమతి దవాఖానలు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు 713 ఉండగా, వరంగల్ జిల్లాలో 220 ఉన్నాయి. వీటికి మూడంతలు నకిలీవే కొనసాగుతున్నాయి. ట్రైసిటీతోపాటు మానుకోట, జనగామ, పరకాల, భూపాలపల్లిలాంటి పట్టణ ప్రాంతాల్లో 2, 500 మంది వరకు ఉన్నట్లు ఫిర్యాదులున్నాయి. నకిలీ వైద్యుల మూలంగా పలువురు రోగులు తీవ్ర అస్వస్థకు గురవుతుండగా, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి వారిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ ఎవరి మీదైనా అనుమానం ఉంటే 91543 82727 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి. నరేష్ కుమార్ కోరుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అనుమతిలేని దవాఖానలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫార్మసీలపై ఇటీవల టాస్క్‌ఫోర్స్ బృందం ఉక్కుపాదం మోపుతోంది. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో అనుమతిలేని దవాఖానతో పాటు వరంగల్ కరీమాబాద్‌లోని డయాగ్నస్టిక్ సెంటర్‌పై ఫిర్యాదులు అందగా వీరి విచారణలో నిజమేనని తేలింది. అయితే.. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులకు కంప్లైంట్ చేసినప్పటికీ ఇప్పటి వరకు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



# ఇంటింటికీ కాషాయ జెండా పంపిణీ

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని 9వ వార్డులో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 9వ వార్డు బిజెపి నాయకుడు సంగా పురుషోత్తం ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఓం జెండా (కాషాయం జెండా) పంపిణీ చేశారు. తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పైన కాషాయ జెండా ఎగరవేయలని కోరారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్, మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి, నాయకులు కుక్కల విజయకుమార్, మార్త బిక్షపతి, మార్త రాజభద్రయ్య, సంగా నరేష్, మెంతుల సురేష్, ఆకుల రాంబాబు, కా నుగుల గోపీనాథ్, వేముల అశోక్, కందుకూరి గిరిప్రసాద్, సదానందం, శ్రీధర్, మోహన్ పాల్గొన్నారు.




# చర్లపల్లి పాఠశాలను సందర్శించిన విద్యార్థులు..

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపూర్ పీఎంశ్రీ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. కార్యక్రమంలో చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు కంచరాజు కుమార్, ప్రధానోపాధ్యాయులు టి.ఓదేలు, ఉపాధ్యాయులు బి.కమలాకర్ డి.సదయ్య పి.రాకేష్, యం.రేవతి, యస్ .సదానందం విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటా

## -బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, గురిజాల శ్రీరామ్ రెడ్డి



అక్షర దర్బార్, సంగెం : బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ భార్య పుష్ప ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశదినకర్మలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి తన వం తు ఆర్థిక సహాయం అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటా మని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మూల్కా ప్రసాద్, దామేర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, బత్తుల సుమంత్, సింగవేన భరత్ యాదవ్, సింగారపు శ్రీనివాస్, కాగితాల సాయికుమార్ , బత్తుల విశ్వాంత్ పాల్గొన్నారు.

# 513 కేజీల గంజాయి దహనం

- దీని విలువ రూ. కోటికిపైనే..
- మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు
- మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

అక్షరదర్బార్, మహబూబాబాద్ : జిల్లావ్యాప్తంగా సీజ్ చేయబడిన కోటి ఇరవై ఎనిమిది లక్షల ఇరవై తొమ్మిది వేల నాలుగు వందల రూపాయలు (1,28,29,400/-) విలువైన 513 కేజీ 176 గ్రాముల గంజాయిని మహబూబాబాద్ జిల్లా పోలీసులు ధ్వంసం చేశారు. వరంగల్ ఉర్సుగుట్ట వద్ద మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాధకద్రవ్యాల నిరోధక శాఖ ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యుల సమక్షంలో గంజాయి దహనం జరిగింది. కార్యక్రమంలో డీఎస్పీ గంద్రతి మోహన్, మహబూబాబాద్ టౌన్ డీఎస్పీ తిరుపతి రావు, డీసీఆర్బీ ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ, గూడూరు సీఐ సూర్యప్రకాష్, మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్, మరిపెడ సీఐ రాజకుమార్ అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు కొంతకాలంగా చేపట్టిన విస్తృత తనిఖీల్లో పట్టుపడి 9 కేసులలో స్వాధీనం చేసుకున్న గంజాయిని జిల్లా మాదకద్రవ్యాల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మహబూబాబాద్ జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువతను డ్రగ్స్ మాయలోకి దూరనీయకుండా అవగాహన కార్యక్రమాలు, కఠినమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం గురించి సమాచారం అందిస్తే ఆ వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

# ఘనంగా వరికోల్ పాఠశాల వార్షికోత్సవం

- విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి
- నడికూడ ఎంఈఓ హనుమంతరావు

అక్షర దర్బార్, పరకాల : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పీఎం శ్రీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నడికూడ మండల విద్యాశాఖ అధికారి కె.హనుమంతరావు అన్నారు. శుక్రవారం నడికూడ మండలం వరికోలు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శరత్ గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం జరిగింది. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు శరత్ గౌడ్ ను అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.విజయలక్ష్మి, పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పోచంపల్లి కవిత తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీకి చిక్కిన డీఈఎంవో..

- మెడికల్ షాప్ నిర్వాహకుడిని లంచం డిమాండ్
- రూ. 30 వేలు తీసుకుంటూ పట్టుబడిన రవిశంకర్

అక్షరదర్బార్, ఆదిలాబాద్: ఓ మెడికల్ షాపు నిర్వాహకుడి నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ జిల్లా ఎక్స్‌టెన్షన్ మెడికల్ ఆఫీసర్ రవిశంకర్ ఏసీబీకి పట్టుబడ్డారు. మాస్ మీడియా అధికారిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. గుడిహత్నూర్ మండలం మున్నూరు గ్రామంలో మూడు రోజుల క్రితం ఓ మైనర్ బాలిక అబార్షన్ జరిగింది. ఈ విషయంలో ఓ మెడికల్ నుంచే మందులు సరఫరా అయ్యాయని అనుమానాలు వ్యక్తం చేస్తూ స్థానికంగా ఉన్న షాపును నిన్న తనిఖీ చేశారు. ఈ కేసులో పేరు లేకుండా చూడాలంటే రూ. 30 ఇవ్వాలని షాప్ నిర్వాహకుడిని డిమాండ్ చేశాడు. అధికారి అడిగిన ప్రకారం లంచం ఇచ్చేందుకు ఒప్పుకున్న షాప్ నిర్వాహకుడు ఇవాళ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆ మొత్తం ఇచ్చేందుకు వెళ్లాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు రూ. 30 వేలు లంచం తీసుకుంటుండగా రవిశంకర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# బేస్ మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు

- ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి
- తాగునీటి సమస్యపై దృష్టిసారించాలి
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు త్వరగా పూర్తికావాలి
- మడికొండ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష
- హాజరైన జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

అక్షరదర్బార్, హైదరాబాద్ : పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై జిల్లా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని, దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లింపులు చేస్తుందన్నారు. మొదటి విడతలో బేస్ మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించని డబుల్ బెడ్ ఇండ్లను కేటాయించాలని, అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు.

- వర్షాకాలంలోపు పూడికతీత పూర్తి చేయాలి

వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టిపరిస్థితుల్లోనూ వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బీ సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

- గ్రామాల్లో పర్యటించాలి

వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పొంగులేటి సూచించారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్‌లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జూన్ లోపు అందుబాటులోకి తేవాలి

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెల రోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

- డంపింగ్ యార్డు సమస్యకు వారంలో పరిష్కారం

మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

# పంజాబ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- ఎస్ కేయం ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ధర్నా

అక్షరదర్బార్, వరంగల్: పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని, ఆ రాష్ట్ర గవర్నర్ ను ఎస్ కేయం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 19వ తేదీన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంతు సింగ్ మాన్ ప్రభుత్వం పంజాబ్, ఢిల్లీ సరిహద్దుల్లో రైతు సంఘాల నాయకులపై లాఠీచార్జి చేసి వారిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కేయం జాతీయ కమిటీ పిలుపుమేరకు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో రైతు సంఘాల నాయకులు నల్ల జెండాలతో ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గతంలో జాతీయ రైతు సంఘాల నాయకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందంతో మాట్లాడి వస్తున్న క్రమంలో రైతు సంఘాల నాయకులైన జగ్జీత్ సింగ్ దలేవాల్, శ్రవణ్ సింగ్ పాంతర్ లతో సహా 400 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ కేయం నాయకులు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, ఎండి ఇస్మాయిల్, ఇంద్రసేన, సుధమల్ల భాస్కర్ అయిత నగేష్ హంసల్ రెడ్డి, మైదంపాని, బి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ఎస్కేఎం నాయకులు



# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గద్దల ప్రవీణ్ తన ఊరిలో జరిగిన పెళ్ళిలో తన వన్ ప్లస్ సెల్ఫోన్ ఎక్కడో పడిపోయింది అని రెండు నెలల క్రితం చిట్యాల PS లో దరఖాస్తు ఇవ్వగా, చిట్యాల పోలీసులు పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి చిట్యాల ఎస్ఐ శ్రవణ్ కుమార్ అప్పగించారు. మొబైల్ ఫోన్ గుర్తించడంలో సహాయపడిన కానిస్టేబుల్ లాల్ సింగ్ ని ఎస్ఐ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన ఫోన్లను వాడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శుక్రవారం
28.03.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# విష ఆహారం తిని ముగ్గురు చిన్నారుల మృతి

- చికిత్స పొందుతున్న తల్లి
- సంగారెడ్డి జిల్లాలో ఘటన

అక్షరదర్బార్, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాగా తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత నివాసం ఉంటున్నారు. వారికి సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. చెన్నయ్య పొట్టకూటి కోసం వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు 3 పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. భోజనం చేసిన తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకు న్నాడు. రాజిత తలుపులు తెరవగా ఆ సమయంలో పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడం వల్ల స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా అప్పటికే ముగ్గురు చిన్నారులు మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





### ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ఘటనా స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంటి ముందు వెనుక భవనంపై కూడా ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోపక్క భార్య పిల్లలు పెరుగన్నం తినటం, భర్త ఒక్కడే పప్పు, అన్నం తినడం అది కూడా సందేహంగా ఉంది. అయితే పిల్లల పోస్టుమార్టం రిపోర్టు వస్తే గాని ఏం చెప్పలేమని పోలీసులు చెబుతున్నారు.

## కూతురిని ప్రేమిస్తున్నాడని యువకుడి హత్య

- పుట్టిన రోజునాడే కిరాతకం..
- గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి
- పోలీసుల అదుపులో నిందితుడు సదయ్య
- పెద్దపల్లి జిల్లాలో కలకలం

అక్షరదర్బార్, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలో పరువు హత్య కలకలం రేపింది. తన కూతురిని ప్రేమిస్తున్నాడని కన్న తండ్రి యువకుడిని పుట్టిన రోజునాడే దారుణంగా గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరుకావడంతో వారి ప్రేమకు అడ్డు చెప్పిన తండ్రి.. తన కూతురిని ప్రేమించొద్దని యువకుడిని హెచ్చరించాడు. కానీ వాళ్లిద్దరూ మాట్లాడుకుంటుండటంతో ఆగ్రహంతో రగిలిపోయాడు. దీంతో ఎలాగైనా యువకుడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. నిన్న రాత్రి సాయికుమార్ స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటుండగా విషయం తెలుసుకున్న తండ్రి సదయ్య అక్కడికి వెళ్లి యువకుడితో గొడవపడి గొడ్డలితో దాడిచేశాడు. తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన యువకుడిని సుల్తానాబాద్ పట్టణంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇవాళ మరణించాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలోని మృతదేహాన్ని ఏసీపీ జి.కృష్ణ , సీఐ సుబ్బారెడ్డి పరిశీలించారు. నిందితుడు సదయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యలో ఇంకెవరి ప్రమేయమైనా ఉన్నదా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రేమించిన కారణంగా యువకుడు ఇలా దారుణ హత్యకు గురవడం జిల్లాలో తీవ్ర సంచలనం రేపింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- 2 శాతం డీఏ పెంపునకు సెంట్రల్ కేబినెట్ ఆమోదం

అక్షరదర్బార్, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53 శాతం నుంచి 55 శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటి మందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48 లక్షల మంది ఉద్యోగులు, 67 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు.

## కార్పొరేట్ సెలూన్లకు స్వస్తి పలకాలి

- మా బతుకులును కాల రాస్తే ప్రతిఘటిస్తాం..
- నాయీ బ్రాహ్మణ సంఘం హెచ్చరిక



అక్షర దర్బార్, చిట్యాల : నాయి బ్రాహ్మణుల బతుకు తెరువుపై దెబ్బతీసే కార్పొరేట్ సెలూన్ లను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని తీరుతామని చిట్యాల మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. శుక్రవారం నాడు మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల నాయకులు మేడిపెల్లి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ తమ కుల వృత్తి సాగక పలు సమస్యలను ఎదుర్కొంటూ అవస్థలు పడుతూ ప్రజాసేవ చేస్తున్నామని, గ్రామాలలో తమకు ఎలాంటి ఆదాయం లేకపోయినప్పటికీ అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నామన్నారు. ఆర్థికలేమితో అవస్థలు పడుతున్నప్పటికీ తాము ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ఇలాంటి సమయంలో కార్పొరేట్ స్థాయి సెలూన్లను ఏర్పాటు చేసి నాయీ బ్రాహ్మణుల కులవృత్తిని దెబ్బతీస్తూ వారికి జీవనమే లేకుండా చేయడానికి ప్రయత్నం చేస్తున్న సంస్థలను క్షమించేదే లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వృత్తిలో నైపుణ్యం లేకున్నా తమ కమ్యూనిటీ కాకపోయినా కొంతమంది డబ్బులు ఉన్న వ్యక్తులు కావాలని దురుద్దేశంతో సెలూన్ లను ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వం జోక్యం చేసుకొని అలాంటి వారిని కట్టడి చేసి తమకు పూర్తిస్థాయిలో బతుకుదెరువు అందే విధంగా చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తూముల సంజీవ్ మాదాసు నాగరాజు దేవేందర్ తూముల శైలేందర్ రాజు మేడిపల్లి రమేష్ మురారి భానుచందర్ భూపతి సూత్రపు శివాజీ నాగవంశీ భాస్కర్ రాజేష్ రాజు తిరుపతి సూత్రపు మహేష్ రవితేజ కొమురయ్య రాకేష్ మహేష్ రాములు పాల్గొన్నారు.

## పరామర్శ..

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను గురువారం చిట్యాల మండల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. ఆయన వెంట పిఏసిఎస్ చైర్మన్ క్రాంతి కుమార్ బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు దామెర రాజు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

* ఉరి వేసుకొని బలవన్మరణం
* వరంగల్ జిల్లా దీక్షకుంటలో ఘటన

అక్షరదర్బార్, నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో విషాదం చోటుచేసుకుంది. ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన ముడుసు సాయి (25) అదే గ్రామానికి చెందిన ఓ యువతిని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. అయితే ఆ యువతి మరో యువకుడితో ప్రేమాయణం సాగిస్తుందన్న అనుమానంతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట మార్చురీకి తరలించారు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

## రోడ్లను త్వరగా పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అండ్ ఆర్ డబ్ల్యూ ఏస్ అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో మంజూరైన రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, రాబోయే వేసవి దృశ్య మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



అక్షర దర్బార్ voice of the people
శుక్రవారం
28.03.2025
www.aksharadarbar.com







- ఏప్రిల్ 27న కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తాం..
- ఎల్కతుర్తిలోని 1200 ఎకరాల్లో భారీగా ఏర్పాట్లు
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

# లక్షలాది మందితో రజతోత్సవ సభ

అక్షరదర్బార్, హన్మకొండ: ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో లక్షలాది మందితో భారీ సభ నిర్వహించనున్నామని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల 60 ఏండ్ల కలను సాకారం చేసింది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. త్యాగాలు, పోరాటాల ద్వారా తెలంగాణను సాధించిన నేత కేసీఆర్ అన్నారు. 25 ఏండ్ల పాటు ప్రజల ఆకాంక్షల మేరకు బీఆర్ఎస్ పార్టీ పని చేసిందని, రజతోత్సవ సభను వరంగల్‌లో లక్షలాది మందితో నిర్వహించనున్నామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...ఉమ్మడి జిల్లాలో 25 ఏండ్ల సభ నిర్వహించేందుకు నిర్ణయించిన కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో 1200 ఎకరాల్లో సభ నిర్వహించేందుకు స్వచ్ఛందంగా రైతులు వారి భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. సభకు వచ్చే ప్రజల అందరికీ తాగునీరు, మజ్జిగ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ బాబు మాట్లాడుతూ.. 25 ఏండ్ల సభ నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రం నుంచి వచ్చే ప్రజలందరికి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. వలంటీర్లను ఇప్పటికే గుర్తించామని, వాహనాలు, ఇతర పార్కింగ్ స్థలాలను ఎంపికచేశామని అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ...తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. 25 ఏండ్లు తెలంగాణ కోసం, ప్రజల కోసమే పని చేసిననాయకుడు కేసీఆర్ అన్నారు. మరో 25 ఏండ్ల కోసం మార్గనిర్దేశం చేసేందుకు సభ పెడుతున్నామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల అభీష్టం మేరకు నడిచే పార్టీ బీఆర్ఎస్ అన్నారు. పార్టీ 25 ఏండ్ల పండుగను అందరం కలిసి విజయవంతం చేస్తామని అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య తదితరులు మాట్లాడారు.

## రేపు ఈ ఏడాది తొలి సూర్య గ్రహణం



అక్షరదర్బార్, పాలకుర్తి: ఈ ఏడాది తొలి సూర్యగ్రహణం శనివారం ఏర్పడనుంది. అయితే భారత కాలమానం ప్రకారం ఇది రాత్రివేళ సంభవిస్తుండటంతో మనదేశంలో కనిపించదని ఖగోళ సైంటిస్టులు చెబుతున్నారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్, అట్లాంటిక్, ఉత్తర, దక్షిణ అమెరికాలోని పలు దేశాల్లో సూర్యగ్రహణం కనువిందు చేయనుంది. అక్కడి కాలమానం ప్రకారం మ.2.20 గంటలకు ప్రారంభమై సా.4.17 గంటలకు సంపూర్ణ దశకు చేరుకుంటుంది. సా. 6.13 గంటలకు సూర్య గ్రహణం పూర్తవుతుంది.

## భద్రతా బలగాలే లక్ష్యంగా మందుపాతర

- ఐఈడీని నిర్వీర్యం చేసిన భద్రతా సిబ్బంది
- ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లాలో ఘటన

అక్షరదర్బార్, ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన 45 కిలోల మందుపాతరను భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెర్పాల్–పలనార్ మార్గమధ్యలో భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఈ మందుపాతరను అమర్చారు. దీనిని గుర్తించిన భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయి. మరోవైపు వరుస ఎన్‌కౌంటర్, నిర్బంధం తీవ్రమైన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసులు గస్తీ పెంచారు. తెలంగాణ రాష్ట్రంలో చొరబాటుకు ఆస్కారం లేకుండా భద్రత పెంచారు. ఈనేపథ్యంలోనే భద్రతా బలగాలను హతమార్చడానికి మావోయిస్టులు ఈ పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. భద్రతా సిబ్బంది మాత్రం టెక్నాలజీ, పక్కా సమాచారంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఆపరేషన్ కగార్‌తో షెల్టర్ జోన్ విచ్చిన్నమవుతున్న క్రమంలో మావోయిస్టులు సరిహద్దులు దాటి, వ్యవసాయ కూలీలుగా రాష్ట్రంలోని ప్రవేశిస్తారని నిఘా వర్గాల సూచనలతో వలస కూలీలపై కన్నేశారు.



## వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు

- మార్నేని రవీందర్ రావు

అక్షరదర్బార్, ఐనవోలు: హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని నందనం రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్ సీఎస్) 53 వ మహాజన సభ శుక్రవారం జరిగింది. సభలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం రవీందర్ రావు మాట్లాడుతూ.. బ్యాంకు పరిపాలన నివేదిక, ఆర్థిక సంవత్సరం బ్యాంకు, సొసైటీ జమ, ఖర్చు, లాభన ష్టాలు, ఆస్తులు, అప్పులను మహాజన సభ ముందు ప్రవేశపెట్టారు. సహకార సంఘాలలోని సభ్యులకు, బ్యాంకు ఖాతాదారులకు ఉచితమైన బ్యాంకు సేవలు అందిస్తున్నామని, కేవలం వ్యవసాయ రుణాలే కాక ఇతర వాణిజ్య బ్యాంకులకు దీటుగా అన్ని రకాల రుణ సేవలు అందిస్తున్నామని, డిపాజిట్ల మీద ఇతర బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీలు చెల్లిస్తున్నామని తెలియజేశారు.. మార్ట్ (సూపర్ మార్కెట్) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం 5 లక్షలు, ఫర్టిలైజర్ ద్వారా రూ.8 లక్షలు, ఇతర వ్యాపారాల ద్వారా సొసైటీకి రూ.8 లక్షల వరకు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తక్కలపల్లి చందర్ రావు, డైరెక్టర్లు బుచ్చి రెడ్డి, ఎలెంద్ర, రామచంద్రం, యేసొబు, సంపత్ రావు, కుమార్, బాబు, సీఈఓ సంపత్ తదితరులు పాల్గొన్నారు

## తాగునీటి సమస్య తలెత్తొద్దు

- విధుల్లో అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి సీతక్క ఆదేశం



అక్షరదర్బార్, హైదరాబాద్: వేసవి దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. వేసవికాలంలో నీటి సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈలతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా తాగు నీటి సరఫరాపై సమీక్షలో మంత్రి చర్చించారు. వరుసగా పండుగలు వస్తున్నాయని.. ప్రజలంతా ఊర్లలోనే ఉంటారు.. మూడు రోజుల పాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దని సూచించారు. జిల్లా కలెక్టర్లతో, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమన్వయం చేసుకొని అభివృద్ది పనుల సందర్భంగా మిషన్ భగీరథ పైపులు డ్యామేజ్ కాకుండా చూసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో ఏదైనా సమస్యలు తలెత్తితే.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యేలతో కలిసి భగీరథ అధికారులు సమావేశం కావాలని అన్నారు.

## ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

అక్షర దర్బార్, దుగ్గొండి: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుగ్గొండి మండలంలో ని తొగర్రాయి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన నల్ల ప్రవళిక 27 తన భర్త నల్ల సుధాకర్ వృత్తిరీత్యా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన అనంతరం ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రవళిక తన చున్నీతో ఫ్యాన్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అప్పటికి ప్రవళికి మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలు తల్లి చిలువేరు రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుగ్గొండి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రవళిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

## దేవాదుల ప్రాజెక్టు పైప్ లైన్ లీక్

- భారీ ఎత్తున ఎగిసిపడిన నీరు
- మరమ్మతులు చేపట్టిన అధికారులు

అక్షరదర్బార్, హన్మకొండ: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామంలో దేవాదుల ప్రాజెక్టు పైపైన్ తాజాగా లీక్ అయింది. పైప్ లైన్ లీక్ కావడంతో భారీ ఎత్తున నీరు ఎగిసిపడింది. పాతాళగంగను తలపిస్తున్న ఈ దృశ్యాన్ని అటుగా వెళ్తున్న వారు తమ సెల్ ఫోన్ కెమెరాల్లో బంధించారు. విద్యుత్ సబ్ స్టేషన్లో పవర్ ట్రిప్ అవడంతో మోటర్ ఒక్కసారిగా ఆగిపోవడం వల్ల పైప్లైన్పై లోడ్ పడి డామేజ్ అయ్యిందని అధికారులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టారు. ఈ పైప్లైన్ ధర్మసాగర్ పంపు హౌస్ నుంచి గండిరామారం రిజర్వాయర్కు వెళ్తంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాలు దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగవుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రులు దేవాదుల మోటార్లను గురువారం ప్రారంభించిన సంగతి తెలిసిందే.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : aksharadarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915